# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

సాక్షాత్తూ శ్రీ సరస్వతీదేవిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము





శరదిందు సమాకారే । పరబ్రహ్మ స్వరూపిణి ।
వాసరా పీఠ నిలయే । సరస్వతి నమోస్తుతే ॥

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

సాక్షాత్తూ శ్రీ సరస్వతీదేవిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము




తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి, M.Tech

**Ph : 9849443752**


శ్రీం

శ్రీ డిజైన్స్

**VEDIC LOGO DESIGNERS**
**www.lordofsevenhills.com**
**www.vratams.com**
**Phone : 040 - 23833752**
**హైదరాబాదు**

## శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

సాక్షాత్తూ శ్రీ సరస్వతీదేవిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**


© సర్వహక్కులు రచయితవి.



First Edition : 2014

Designed & Printed at :
**SRI VASAVI PRINTERS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.


**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి రచించిన వ్రత పుస్తకాలు :**

| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం | శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం |
| శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతకల్పం | శ్రీ రామరక్షా వ్రతం |
| శ్రీ ఆనంద ఆంజనేయం (శ్రీ హనుమత్ వ్రతం) | శ్రీ సాయి రక్షా వ్రతం |
| శ్రీ మహేశ్వర వ్రతం | శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం |

ఈ వ్రతపుస్తకాలన్నీ ఎంతో తేలికభాషలో రచింపబడి నిత్యం లక్షలాది భక్తులచేత ఆచరింపబడుతున్నాయి. ఎటువంటి నియమ నిబంధనలూ లేకుండా కేవలం కథలు చదివినవారికి కూడా జీవితం శుభప్రదంగా జరుగుతున్నది. ఈ పుస్తకాలు కావలసినవారు క్రింద చిరునామాలో సంప్రదించవచ్చును. వీలునిబట్టి పంపడం జరుగుతుంది. ఈ పుస్తకాలన్నీ ఈ వెబ్‌సైట్‌ల నుంచి పూర్తి ఉచితంగా ప్రింట్ చేసుకొనవచ్చును.

**www.lordofsevenhills.com**
**www.vratams.com**


**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No. 202, Plot No. 32, Srikar's Ravi Residency, Beside Nalanda High School, Near Motinagar 'X' Roads, HYDERABAD - 500 018, India.
Ph:040-23833752. Cell : 98494 43752
Email : viswapathi@yahoo.com, shridesigns@gmail.com

# నివేదన

శరదిందు సమాకారే పర(బ్రహ్మ స్వరూపిణి
వాసరా పీఠనిలయే సరస్వతీ నమోస్తుతే

సరస్వతీదేవి బ్రహ్మస్వరూపిణి. సర్వ విద్యలకూ అధిదేవత. వేదాలకు తల్లి, చదువులతల్లి సరస్వతీదేవి మాఘశుద్ధ పంచమినాడు ఉద్భవించింది. ఈ వసంతపంచమినే శ్రీపంచమి అని కూడా అంటారు. శ్రీపంచమి రోజున జ్ఞానసరస్వతీ దేవాలయానికి వెళ్ళి ఆ తల్లిని దర్శిస్తే సర్వవిద్యలూ లభిస్తాయి.

1983లో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్ నుండి ఎం.టెక్. చదివిన నేను 1984 దాకా ఆల్విన్‌లోనూ, 1989 దాకా ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజిలోనూ ఉద్యోగం చేశాను. 1983లో చి॥సౌ॥ వేంకట రుక్మిణి వైదేహితో వివాహం. ముగ్గురు పిల్లలు, ఆనంది, ఆముక్త, ఆదిత్యలు.

1998 నుంచి బిజినెస్ సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించటం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 5,000 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయవలన నేను ఇప్పటిదాకా ఇరవైరెండు పుస్తకాలు రచించడం జరిగింది. వీటిలో పధ్నాలుగు ఆ శ్రీనివాసుని లీలా విశేషాలపైననే! ఈ పుస్తకాలన్నీ దేశ విదేశాలలోని భక్తులచేత నిత్యం పఠింపబడటం ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు చదివిన ప్రతి వారికీ ఎన్నో శుభాలు జరుగుతున్నాయి. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో వీరందరూ ఎంతో సుఖంగా జీవిస్తున్నారు. ఈ రచనలన్నిటిలో శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతకల్పం, శ్రీ ఆనంద ఆంజనేయం, శ్రీ మహేశ్వర వ్రతం, శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం, శ్రీ సాయిరక్షా వ్రతం, శ్రీరామరక్షావ్రతం భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ ఏడు వ్రతాలు నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి. ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది?

ఎప్పటినుంచో కొందరు భక్తులు నన్ను సరస్వతీవ్రతం రచించవలసిందిగా అడుగుతున్నారు. కానీ ఆ భగవంతుని సంబంధించిన ఏ పుస్తకానికైనా ఆ దేవత కరుణ



కలిగేదాకా వ్రాయటం కుదరదని నా నమ్మకం. నేను రచించిన ప్రతి పుస్తకం వెనుక ఈ విషయం ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది. ఇన్ని రోజులకు శ్రీ సరస్వతీదేవి కృపతో ఈ పుస్తకం రచించడం జరిగింది. కొన్ని నెలల క్రితం మా మనుమరాలు చి॥తన్వి అక్షరాభ్యాసానికై బాసర పుణ్యక్షేత్రం వెళ్లడం జరిగింది. ఆనాడే ఈ పుస్తకరచనకు ఆ తల్లి అనుగ్రహం కలిగింది. ఈ వ్రతం చేసుకొనటం ఎంతో తేలిక. ఎవరైనా, ఎప్పుడైనా ఈ వ్రతం ఆచరించి ఆ తల్లి అనుగ్రహం పొందవచ్చును. సరస్వతీదేవిని ఆరాధించటంచేత తేజస్సు, యశస్సు, బుద్ధి, జ్ఞానము, వికాసము, కార్యసిద్ధి, శీఘ్రకళ్యాణం, సత్సంతాన ప్రాప్తి, పదోన్నతి, ఆరోగ్యము, అష్టైశ్వర్యములు లభిస్తాయి.

ఈ పుస్తకాన్ని చక్కగా డి.టి.పి. చేయించి అచ్చు వేయించిన శ్రీ వాసవీ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు ఆ శ్రీ సరస్వతీమాత అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తక ప్రథమ ముద్రణకి సహకరించిన ఎంతోమందికి నా కృతజ్ఞతలు. ముఖ్యంగా శ్రీ కాటంరెడ్డి శివకుమార్ రెడ్డి, శ్రీమతి గిరిజ గార్లకు (గౌతమి విద్యాధామం, యస్.ఆర్.నగర్, హైదరాబాద్), శ్రీ కృష్ణమూర్తి, శ్రీమతి సూర్యకుమారి, శ్రీ జగన్‌మోహనరెడ్డి, శ్రీమతి వేంకటేశ్వరమ్మ (నాగార్జున హైస్కూల్, యస్.ఆర్.నగర్) గార్లకు ఎన్నో కృతజ్ఞతలు. ఇదంతా కూడా కేవలం స్వామివారి ప్రేరణ అనుకుంటున్నాను. వీరికి, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ వాగ్దేవి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ వ్రతకల్పం ఆచరించిన మీకు, వ్రత కథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీ సరస్వతీమాతను ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

**శ్రీ సరస్వతీ కటాక్ష సిద్ధిరస్తు**
**సమస్త సన్మంగాళానిభవంతు ః**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**
Hyderabad
2014
viswapathi@yahoo.com
shridesigns@gmail.com
Ph : 9849443752

## ఈ వ్రతం ఎలా ఆచరించాలి?

- ఈ పుస్తకాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, వయసుతోగానీ, కులంతోగానీ నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష భేదం లేదు, ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. పంచమి, ఏకాదశి, పౌర్ణమి తిథులందు పఠిస్తే మరింత శుభప్రదం. బుధ, గురు, శుక్ర వారాలలో చదివితే చాలా మంచిది. జన్మజన్మల పాపాలు నశిస్తాయి. ఎంతో పుణ్యఫలం కలుగుతుంది. ఈ వ్రతం ఆచరించే రోజున ఉపవాసం తప్పక ఉండాలనే నియమం లేదు.

- ఈ వ్రతం ఆచరించేముందు ఒక్కసారి మనస్సులోనే గణపతికి, నవగ్రహదేవతలకు, అష్టదిక్పాలకులకు నమస్కరించవలెను. అటుతరువాత మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్రం మనస్సులో తలచుకొని వ్రతం మొదలుపెట్టవలెను. శ్రీ సరస్వతీ అష్టోత్తర నామాలు పఠించాలి. తరువాత ఈ పుస్తకంలోని ఐదు కథలను చదివి శ్రీ సరస్వతీ అమ్మవారికి ఏ ఫలమునైనా నివేదింపవచ్చును.

- పరీక్షలు వ్రాసే విద్యార్థులు ఈ వ్రతంలోని ఐదు కథలనూ చదివి, సరస్వతీదేవికి అరటిపండ్లను నివేదించి, వ్రతం తేలికగా ఆచరింపవచ్చును. వారు రాసే పరీక్షలలో వారికి తప్పక విజయం చేకూరుతుంది.

- ఏ శంకరమఠంలోనైనా కూర్చుని ఈ ఐదుకథలూ చదువుకుని అక్కడ కొలువై ఉన్న శారదా మాతకు అరటిపండ్లు నైవేద్యం పెడితే విశేష ఫలితం కలుగుతుంది. మీరు అనుకున్న పనులన్నీ విజయవంతంగా పూర్తవుతాయి. వివాహం కానివారికి వెంటనే వివాహం జరుగుతుంది. సంతానం లేనివారికి త్వరలోనే సత్సంతానం కలుగుతుంది. విద్యార్థులు కానీ, వారి తల్లిదండ్రులు కానీ ఇలా ఆచరించినచో వారికి పరీక్షలలో విజయం చేకూరుతుంది. ఉదయాన్నే కానీ, సాయంత్రం కానీ ఎప్పుడైనా ఆచరింపవచ్చును. ఉపవాసం ఉండనవసరం లేదు.

- **ప్రతీ విద్యాసంస్థలోనూ ఈ వ్రతం తేలికగా ఆచరించవచ్చును. విద్యాసంస్థల యజమాని వారి ఇంట్లో ఆచరించినా ఆ విద్యాసంస్థ ఎంతో అభివృద్ధిలోనికి వస్తుంది. ప్రతీ సంవత్సరం స్కూలు, కాలేజీ, ప్రారంభమైన మొదటి నెలలో ఉపాధ్యాయుడు అన్ని తరగతులలో ఈ కథలను విద్యార్థులకు చదివి వినిపించి అమ్మవారికి అరటిపండు నైవేద్యం ఇచ్చి ఆ అరటిపండ్ల ముక్కలను విద్యార్థులకు ప్రసాదంగా ఇవ్వవచ్చును. అవి స్వీకరించిన విద్యార్థులకు ఆ సరస్వతీమాత అనుగ్రహం కలుగుతుంది. ఎంతో శ్రద్ధగా చదువుకుంటారు. వారికి చక్కటి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లభిస్తుంది. ఏరోజైనా ఉదయం 9గంటల సమయంలో క్లాసులో టేబుల్‌పై శ్రీ సరస్వతీమాత ఫోటో ఉంచి ఈ కథలన్నీ ఉపాధ్యాయుడు చదివి విద్యార్థులకు వినిపించవచ్చు.**

- **పరీక్షలముందు ప్రతీ క్లాసులోనూ విద్యార్థులకు ఏదైనా ఒక మంచి రోజు ఉదయం ఈ కథలు చదివి వినిపించి అరటిపండ్లను సరస్వతీమాతకు నైవేద్యం పెట్టవచ్చును. ఆ నైవేద్యం స్వీకరించిన విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయి. ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులౌతారు.**



- **అక్షరాభ్యాసం నాడు ఈ వ్రతం ఆచరిస్తే ఆ అబ్బాయి / అమ్మాయికి చక్కటి బుద్ధి, జ్ఞానం కలుగుతుంది. ఉన్నతవిద్యలు చదువుతాడు.**

- ఏవైనా పోటీపరీక్షలు వ్రాసేముందు ఈ వ్రతం ఆచరిస్తే ఆ పరీక్షలో మంచి మార్కులు వచ్చి విజయం సాధిస్తారు. ఇంటర్వ్యూలకు వెళ్ళేముందు కూడా ఈ వ్రతం ఆచరించి విజయం పొందవచ్చును.

- ఈ వ్రతం ఆచరించేటప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ తప్పక కలిసి ఆచరించాలనే నియమం లేదు. భర్తకు వీలున్నప్పుడు భర్త, భార్యకు వీలున్నప్పుడు భార్య, ఇలా ఎవరి వీలును బట్టి వారు ఆచరించవచ్చును. వీలున్నప్పుడు ఇద్దరూ కలిసి ఆచరింపవచ్చును.

- దురదృష్టవశాత్తు భార్యను కోల్పోయిన పురుషులు కానీ, భర్తను కోల్పోయిన స్త్రీలు కాని కూడా నిరభ్యంతరంగా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించినవారికి పూర్తి మనశ్శాంతి కలుగుతుంది.

- సంతానం లేనివారు ఏ ఆలయంలోనైనా శుక్రవారం ఈ పుస్తకం పఠిస్తే తప్పక చక్కటి సంతానం కలుగుతుంది. వివాహం కాని కన్యలు కానీ, యువకులు కానీ, ఈ విధంగా చదివితే త్వరలో వివాహం జరుగుతుంది.

- దూరదేశాలలో ఉండే మీ పిల్లల నిమిత్తం, మీరు కూడా చదువవచ్చును. వారికి విద్య, వివాహం, సంతానం, ఉద్యోగం, ఆరోగ్యం కొరకు ఈ పుస్తకాన్ని శుక్రవారం నాడు ఏ ఆలయంలోనైనా చదివితే వెంటనే ఫలితం కలుగుతుంది.

- **ఈ వ్రతం ఆచరింపడం వలన వయస్సు పెరుగుతున్న కొద్ది సహజంగా తగ్గే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మనం చేసే పనులన్నింటిలో ఏకాగ్రత కలుగుతుంది. మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.**

- సంగీతం, నృత్యం, గానం, చిత్రలేఖనం వంటి కళలలో ప్రావీణ్యం పొందాలనుకునేవారు ఈ వ్రతాన్ని ఏ శుక్రవారమైనా ఆచరిస్తే వారికి మంచి అవకాశాలు లభించి ఎంతో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. వారి వారి రంగాలలో మంచి గుర్తింపు లభిస్తుంది. ఈ రంగాలలో ఏవైనా పరీక్షలకు వెళ్ళేటప్పుడు ఈ వ్రతం ఆచరిస్తే ఆ పరీక్షలలో విజయం కలుగుతుంది.

ఈ విధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా, ఈ పుస్తకం పఠించి శ్రీ సరస్వతీమాత అనుగ్రహం పొందవచ్చును.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

Hyderabad
2014

viswapathi@yahoo.com
shridesigns@gmail.com
Ph : 9849443752

# శ్రీ సరస్వతీ అష్టోత్తర శతనామావళిః

ఓం శ్రీ సరస్వత్యై నమః
ఓం మహాభద్రాయై నమః
ఓం మహామాయాయై నమః
ఓం వరప్రదాయై నమః
ఓం శ్రీప్రదాయై నమః
ఓం పద్మనిలయాయై నమః
ఓం పద్మాక్ష్యై నమః
ఓం పద్మవక్త్రాయై నమః
ఓం శివానుజాయై నమః
ఓం పుస్తకభృతే నమః
ఓం జ్ఞానముద్రాయై నమః
ఓం రమాయై నమః
ఓం పరాయై నమః
ఓం కామరూపాయై నమః
ఓం మహావిద్యాయై నమః
ఓం మహాపాతకనాశిన్యై నమః
ఓం మహాశ్రయాయై నమః
ఓం మాలిన్యై నమః
ఓం మహాభోగాయై నమః
ఓం మహాభుజాయై నమః
ఓం మహాభాగ్యాయై నమః
ఓం మహోత్సాహాయై నమః
ఓం దివ్యాంగాయై నమః
ఓం సురవందితాయై నమః
ఓం మహాకాళ్యై నమః
ఓం మహాపాశాయై నమః
ఓం మహాకారాయై నమః
ఓం చంద్రవదనాయై నమః
ఓం చంద్రలేఖావిభూషితాయై నమః
ఓం సావిత్ర్యై నమః
ఓం సురసాయై నమః
ఓం దేవ్యై నమః
ఓం దివ్యాలంకారభూషితాయై నమః
ఓం వాగ్దేవ్యై నమః
ఓం వసుధాయై నమః
ఓం తీవ్రాయై నమః
ఓం మహాభద్రాయై నమః
ఓం మహాబలాయై నమః
ఓం భోగదాయై నమః
ఓం భారత్యై నమః
ఓం భామాయై నమః
ఓం గోవిందాయై నమః
ఓం గోమత్యై నమః
ఓం శివాయై నమః
ఓం జటిలాయై నమః
ఓం వింధ్యవాసాయై నమః
ఓం వింధ్యాచలవిరాజితాయై నమః
ఓం చండికాయై నమః
ఓం వైష్ణవై నమః
ఓం బ్రాహ్మై నమః
ఓం బ్రహ్మజ్ఞానైకసాధనాయై నమః
ఓం సౌదామిన్యై నమః



ఓం సుధామూర్తయే నమః
ఓం సుభద్రాయై నమః
ఓం మహాంకుశాయై నమః
ఓం సీతాయై నమః
ఓం విమలాయై నమః
ఓం విశ్వాయై నమః
ఓం విద్యున్మాలాయై నమః
ఓం వైష్ణవై నమః
ఓం చంద్రికాయై నమః
ఓం బ్రహ్మజాయాయై నమః
ఓం మహాఫలాయై నమః
ఓం త్రయీమూర్త్యై నమః
ఓం త్రికాలజ్ఞాయై నమః
ం త్రిగుణాయై నమః
ఓం శాస్త్రరూపిణ్యై నమః
ఓం శుంభాసుర ప్రమథిన్యై నమః
ఓం శుభదాయై నమః
ఓం సరాత్మికాయై నమః
ఓం రక్త బీజనిహంత్ర్యై నమః
ఓం చాముండాయై నమః
ఓం అబికాయై నమః
ఓం ముణ్డకాయప్రహరణాయై నమః
ఓం ధూమ్రలోచనమర్దనాయై నమః
ఓం సర్వదేవతస్తుతాయై నమః
ఓం సౌమ్యాయై నమః
ఓం సురాసురనమస్కృతాయై నమః
ఓం కాళరాత్ర్యై నమః
ఓం కళాధారాయై నమః
ఓం రూపసౌభాగ్యదాయిన్యై నమః
ఓం సురపూజితాయై నమః
ఓం సువాసిన్యై నమః
ఓం సునాసాయై నమః
ఓం వినిద్రాయై నమః
ఓం పద్మలోచనాయై నమః
ఓం విద్యారూపాయై నమః
ఓం విశాలాక్ష్యై నమః
ఓం వాగ్దేవ్యై నమః
ఓం వరారోహాయై నమః
ఓం వారాహ్యై నమః
ఓం వారిజాసనాయై నమః
ఓం చిత్రాంబరాయై నమః
ఓం చిత్రగంధాయై నమః
ఓం చిత్రమాల్యవిభూషితాయై నమః
ఓం కాంతాయై నమః
ఓం కామప్రదాయై నమః
ఓం వంద్యాయై నమః
ఓం విద్యాధరసుపూజితయై నమః
ఓం శ్వేతాసనాయై నమః
ఓం నీలభుజాయై నమః
ఓం చతుర్వర్గ ఫలప్రదాయై నమః
ఓం చతురానన సామ్రాజ్యాయ నమః
ఓం రక్తమధ్యాయై నమః
ఓం నిరంజనాయై నమః
ఓం హంసాసనాయై నమః
ఓం నీలజంఘాయై నమః
ఓం బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః

# అక్షరాభ్యాస పూజ

## (అక్షరాభ్యాస సమయమున ఈ పూజ చేయవలెను.)

సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణీం !
విద్యారాంభం కరిష్యామి, సిద్ధిర్భవతు మే సదా !
పద్మపత్ర విశాలాక్ష్మి పద్మకేసరి వర్ణని
నిత్యం పద్మాలయాం దేవి సామాంపాతు సరస్వతి
ఓం ఐం సరస్వత్యై నమః శిరోమేపాతు
ఓం ఐం సరస్వత్యై నమః ఫాల మే పాతు
ఓం ఐం సరస్వత్యై నమః నేత్రయుగ్మం పాతు
ఓం ఐం సరస్వత్యై నమః నాసాం పాతు
ఓం ఐం సరస్వత్యై నమః జేష్ఠం పాతు
ఓం ఐం సరస్వత్యై నమః దంతంపంక్తి పాతు
ఓం ఐం సరస్వత్యై నమః కంఠం పాతు
ఓం ఐం సరస్వత్యై నమః పక్షం పాతు
ఓం ఐం సరస్వత్యై నమః జిహ్వాగ్రవాసిన్యై పాతు
ఓం ఐం సరస్వత్యై నమః (మూడుసార్లు)
ఈ బీజాక్షరములతో పలకను పుస్తకములను పూజించి
"ఓం శివాయ సిద్ధం నమః" యని దిద్దించి అక్షరములు నేర్పవలెను.



# శ్రీ సరస్వతీ ద్వాదశనామ స్తోత్రమ్

సరస్వతీ త్వియం దృష్ట్వా వీణాపుస్తక ధారణీ ।
హంసవాహ సమాయుక్తా విద్యాదానకరీ మమ ॥ 1

ప్రథమం భారతీనామాం ద్వితీయం చ సరస్వతీ ।
తృతీయం శారదాదేవీ చతుర్థం హంసవాహనీ ॥ 2

పంచమం జగతీ ఖ్యాతం షష్ఠం వాగీశ్వరీ తథా ॥
కౌమారీ సప్తమం ప్రోక్త మష్టమం బ్రహ్మచారిణీ ॥ 3

నవమం బుద్ధిధాత్రీ చ దశమం వరదాయినీ ।
ఏకాదశం క్షుద్రఘంటా ద్వాదశం భువనేశ్వరీ ॥ 4

బ్రాహ్మీ ద్వాదశనామాని త్రిసంధ్యం యః పఠేన్నరః ।
సర్వసిద్ధికరీ తస్య ప్రసన్నా పరమేశ్వరీ । 5
సామే వసతు జిహ్వాగ్రే బ్రహ్మరూపా సరస్వతీ ॥

# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

## మొదటి అధ్యాయం

### రామశర్మ కథ

పూర్వకాలంలో గౌతమీ నదీ తీరంలో రామాపురం అనే గ్రామం ఉండేది. అందులో రామశర్మ, సుమతి అనే దంపతులు ఉండేవారు. రామశర్మ ఆ ఊరిలో శ్రీ సీతారామచంద్రులవారి ఆలయంలో అర్చకత్వం నిర్వహిస్తూ జీవించేవాడు. వీలున్నప్పుడు ఈ ఊరి వారి ఇళ్ళల్లో పౌరోహిత్యం కూడా చేస్తూ కాలం వెళ్ళబుచ్చేవాడు. ఆ దంపతులకు జీవితం బాగానే గడిచిపోతున్నది. కానీ సంతానం లేకపోవడం వెలితిగా ఉండేది. వివాహం జరిగి ఆరు సంవత్సరాలైనా సంతానం కలగలేదు. సంతానం కోసం వారు ఎన్నో వ్రతాలు చేశారు. ఎందరో దేవతలను ప్రార్థించారు. ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించారు. అయినా ఏ మాత్రం ఫలితం లేకపోయింది. ఈ విషయం వారికి ఎప్పుడూ బెంగగా ఉండేది.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు ఆ ఊరికి దూరదేశం నుండి ఒక సాధువు వచ్చాడు. ఆ సాధువు ఊరిబయట ఉన్న పెద్ద చెట్టుకింద తన శిష్యులతో మకాం పెట్టాడు. పగలంతా పూజలతోనూ, భజనలతోనూ కాలం గడిపి సాయంత్రం తన వద్దకు వచ్చేవారికి నాలుగు మంచి మాటలు చెప్పేవాడు. ఊరివారు తమ ఇళ్ళకు రమ్మని ఎంత ప్రాధేయపడినా వచ్చేవాడు కాదు. ఆ సాధువుకి భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు తెలుసునని ఎన్నో మహిమలు ఉన్నాయని జనం చెప్పుకునేవారు. ఇది విని రామశర్మ ఒకనాడు భార్యతో కలిసి ఆ సాధువును దర్శించుకున్నాడు. ఆ దంపతులిద్దరూ ఆ సాధువుకు నమస్కరించి తమకు సంతానం కలిగే ఉపాయం చెప్పమని ప్రార్థించారు. ఆ సాధువు కాసేపు కనులు మూసుకుని చేతిలోకి ఒక మామిడి పండును తీసుకుని భార్య సుమతి చేతికి ఇచ్చాడు. మరునాడు ఏకాదశి అని, ఉదయం స్నానం చేయగానే ఈ పండు తినమని, తప్పక చక్కటి పుత్రుడు జన్మిస్తాడని ఆశీర్వదించాడు.



రామశర్మ దంపతులిద్దరూ సాధువుకి నమస్కరించి ఇంటికి వెళ్ళారు.

ఇంటికి చేరగానే ఇంటి బయట రామశర్మ బావమరిది భార్యా పిల్లలతో వచ్చి వీరి కోసం వేచి చూస్తున్నాడు. అన్నా వదినలు రావడం చూసి సుమతి ఎంతో సంతోషించింది. వారిని లోపలికి తీసుకెళ్ళి సాధువు ఇచ్చిన మామిడి పండును గూట్లో జాగ్రత్తగా పెట్టింది. ఆ రాత్రి వారందరూ కబుర్లు చెప్పుకుంటూ ఆలస్యం పడుకున్నారు.

ఉదయాన్నే బావమరిది కృష్ణశర్మ హడావుడిగా బయటకు వెళ్లవలసిన పని ఉండటంచేత సుమతి తెల్లవారుఝామునే లేచి తమ్ముడికి వంట సిద్ధం చేసింది. ఈ హడావిడిలో సాధువు ఇచ్చిన మామిడి పండు మరిచిపోయింది. కృష్ణశర్మ దంపతులకు ఆ రోజు రాత్రిగాని ఆ విషయం గుర్తు రాలేదు. మరునాడు ఉదయం స్నానం చేసి ఆ పండు చేతిలోకి తీసుకుంది. అయితే ఆ పండుకి ఒక పక్కన కొంచం చీమలు పట్టి ఉన్నాయి. ఆమె ఆ చీమలను తీసివేసి కనులకద్దుకుని వెంటనే ఆరగించింది. మనస్సులో ఆ సాధువును తలచుకుని ఆలస్యం చేసినందుకు క్షమించమని ప్రార్థించింది. తనకు మంచి సంతానం ప్రసాదించమని సకల దేవతలను వేడుకున్నది.

ఆ మామిడిపండు ప్రభావంచేతి సుమతి కొద్దిరోజులలోనే గర్భం దాల్చి పండంటి మగపిల్లవాడిని కన్నది. ఆ పిల్లవాడికి ఆ దంపతులు ప్రభాకరశర్మ అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. ఐదవ ఏడు రాగానే ఆశ్రమ పాఠశాలకు పంపారు. అయితే సాధువు ఇచ్చిన ప్రసాదం కొంచెం నిర్లక్ష్యం చేసిన కారణంగా అతడికి గురువులు ఎంత ప్రయత్నించినా ఏమాత్రం చదువు అబ్బటం లేదు. మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క అక్షరం ముక్క కూడా రాలేదు. రామశర్మకు ఎంతో బాధ కలిగి ఒకనాడు కొడుకుని ఎంతో విసుక్కున్నాడు. తండ్రి మాటలకు ప్రభాకరశర్మ ఎంతో బాధ పడ్డాడు. ఉదయం లేవగానే ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. ఊరిబయటకు వచ్చి అడవిదారిగుండా నడవసాగాడు.

పిల్లవాడు కనపడక రామశర్మ ఎంతో వెతికాడు. అయినా లాభం లేకపోయింది. అడవికి వెళ్ళిన ప్రభాకరశర్మ అటు ఇటు తిరిగి రాత్రి సమయానికి ఒక పురాతన గృహం వద్దకు చేరుకున్నాడు. అదేదో ఆలయం లాగా అనిపించింది. చీకటి పడటంతో భయం చేత రాత్రి ఇక్కడే ఉందామనుకున్నాడు. గర్భాలయంలోకి వెళ్ళి అక్కడ అంతా శుభ్రం చేసి ఒక పక్కగా పడుకున్నాడు. ఆ రాత్రివేళ ప్రభాకరశర్మకు ఒక దేవత ప్రత్యక్షమై ఇలా అన్నది. నాయనా! నేను సర్వజ్ఞానానికీ అదిదేవతనైన సరస్వతిని. ఎంతో కాలంగా ఎవ్వరికీ పట్టనటువంటి ఈ ఆలయాన్ని నీవు శుభ్రం చేశావు. అందునా ఈ రోజు వసంత పంచమి. నాకెంతో ప్రీతికరమైన రోజు. ఈ పుణ్యదినాన నా ఆలయాన్ని

శుభ్రం చేసిన నీకు ఎంతో పుణ్యం దక్కింది. నీకు సర్వ విద్యలనూ అనుగ్రహిస్తున్నాను. ఉదయాన్నే నీ ఊరికి వెళ్ళు. నీకు అన్నింటా శుభం జరుగుతుంది అని చెప్పి మాయమైంది.

ప్రభాకర శర్మ ఉదయం లేవగానే అద్భుతమైన సరస్వతీ మాత విగ్రహాన్ని చూశాడు. ఆలయం శుభ్రం చేసి ఆ తల్లికి నమస్కరించాడు. అప్రయత్నంగానే అతని నోటివెంట అద్భుతమైన కవిత్వం వచ్చింది. ఆ తల్లిని ఎంతో దివ్యంగా కీర్తించాడు. ఆ తల్లి అనుగ్రహంతో అతడు తిరిగి ఇంటికి చేరాడు. తల్లిదండ్రులకు జరిగినవిషయమంతా చెప్పాడు. రామశర్మ దంపతులు ఎంతో సంతోషపడి ఊరిలోని ముఖ్యులను తీసుకుని అడవిలోకి వెళ్ళి అక్కడ జీర్ణావస్థలో ఉన్న సరస్వతీ ఆలయం వద్దకు చేరారు. అందరూ కలిసి ఆ ఆలయాన్ని శుభ్రం చేసి కొన్ని రోజుల తర్వాత బ్రహ్మాండమైన ఉత్సవాలు చేశారు. అక్కడ ఆలయగోడలపై ఉన్న శాసనాల ద్వారా అక్కడ ఉన్న సరస్వతీమాతను సాక్షాత్తూ వ్యాసులవారు ప్రతిష్ఠించినట్లుగా గ్రహించారు. అటుతరువాత కొంతకాలానికే ఈ ప్రదేశం శ్రీ సరస్వతీదేవికి ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. ఆ తల్లిని ఆరాధించినవారికి సంపూర్ణ జ్ఞానం కలుగుతుందని భక్తులు గ్రహించారు.

చదువుల తల్లి సరస్వతీదేవి మాఘ శుద్ధ పంచమి నాడు ఉద్భవించింది. భక్తులపాలిటి కల్పవల్లి అయిన ఆ తల్లి తన భక్తుడు తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తికి వైశాఖ శుద్ధ పంచమినాడు ఈ జ్ఞాన సరస్వతీ వ్రతం అనుగ్రహించింది. ఏ నెలలోనైనా పంచమి నాడు ఈ వ్రతం ఆచరిస్తే అద్భుత ఫలితం కలుగుతుంది. ప్రత్యేకించి వసంత పంచమినాడు సరస్వతీ దేవి ఏ ఆలయంలోనైనా, ఏ విద్యాసంస్థలోనైనా ఈ వ్రత కథలు చదివినవారికి ప్రసాదం స్వీకరించినవారికి సంపూర్ణ జ్ఞానం కలుగుతంది. ఆ తల్లికి అరటిపండ్లు కానీ, రేగు పండ్లు కానీ, చెఱకు ముక్కలు కానీ నివేదింపవచ్చును. ఈ వ్రతం ఆచరించిన వారి సంతానం చక్కటి విద్యావంతులు కాగలరు. అన్ని పరీక్షలలో విజయం సాధించగలరు,.. ఆ కుటుంబం సర్వశుభాలను పొందగలదు.

ప్రథమ అధ్యాయము సమాప్తము



# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

## రెండవ అధ్యాయం

### జ్ఞానసరస్వతీ పీఠం దివ్యకథ

పూర్వకాలంలో ఆంధ్రదేశంలో గోదావరీ తీరాన మహదేవపురం అనే గ్రామం ఉండేది. ఆ గ్రామంలో ఒక పురాతన శివాలయం ఉండేది. ఈ ఆలయంలోని శివలింగాన్ని సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ప్రతిష్ఠించాడని ప్రజలు అనుకునేవారు. మహదేవపురంలోని ప్రజలందరూ ఎంతో సఖ్యంగా, ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఉండేవారు. ఆ గ్రామంలో పాఠశాల మాత్రం లేక పిల్లలను దూరప్రాంతాలకు పంపవలసి వచ్చేది. గ్రామంలో ఒక పాఠశాలను నెలకొల్పాలని గ్రామపెద్దలు ఎన్నోసార్లు ప్రయత్నించి నప్పటికీ ఎందుకో అది కార్యరూపం దాల్చేదికాదు. ఎప్పుడూ ఏవో అడ్డంకులు వచ్చేవి.

ఇలా ఉండగా ఆ ఊరికి ఒకనాడు పురుషోత్తమశాస్త్రి అనే పండితుడు కుటుంబ సమేతంగా వచ్చాడు. పురుషోత్తమశాస్త్రి సర్వశాస్త్ర పారంగతుడు. ఊరివారందరూ అతడిని తమ ఊరిలోనే ఉండమని అర్థించారు. అతడి కుటుంబం సుఖంగా ఉండడానికి అన్ని సదుపాయాలూ సమకూరుస్తామని ఇక్కడే కుటుంబంతో ఉండి తమ ఊరి పిల్లలకు చదువు నేర్పించమని అన్నారు. పురుషోత్తమశాస్త్రి అందుకు సరేనన్నాడు. కొద్దిరోజులకే ఆ ఊర్లో ఒక చిన్నపాఠశాల ప్రారంభమైంది. పిల్లలందరూ ఇక్కడే చదువుకోసాగారు.

పురుషోత్తమశర్మ పాఠశాల రెండు సంవత్సరాలు బాగానే నడిచింది. కానీ మూడవ సంవత్సరం నుండి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎందుకోగానీ ఇక్కడ చదివిన పిల్లలకు చదువు సరిగ్గా అబ్బేది కాదు. దానివలన తల్లిదండ్రులు తమ పిల్లలను మెల్లమెల్లగా ఈ పాఠశాలనుండి మాన్పించి వేరే ఊరికి పంపేవారు. ఇలా ఐదు సంవత్సరాలు అయ్యేసరికి పాఠశాలలో కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే మిగిలారు.

పురుషోత్తమశాస్త్రికి చాలా బాధ కలిగింది. ఈ పాఠశాల నడపడం సాధ్యం కాదనుకున్నాడు. కానీ అలాగని ఊరు విడిచి తిరిగి తన ఊరు వెళ్ళాలంటే మనస్సు ఒప్పలేదు. ఐదు సంవత్సరాలు ఇక్కడ ఉండటంచేత ఈ ఊరిపై ఎంతో మమకారం ఏర్పడింది.

పురుషోత్తమశాస్త్రికి ఒకనాడు ఒక ఆలోచన వచ్చింది. చదువుల తల్లి సరస్వతిని ఎలాగైనా ప్రసన్నం చేసుకోవాలనుకున్నాడు. ఆ తల్లి అనుగ్రహం ఉంటే తప్ప ఈ పాఠశాలకు వైభవం కలగదని తలచాడు. ఎలాగైనా ఆ తల్లిని ప్రసన్నం చేసుకోవాలని గట్టిగా సంకల్పించాడు. ఆ మరునాటినుండి పురుషోత్తమశాస్త్రి కఠోర ఉపవాసం చేస్తూ కేవలం పండ్లనే ఆహారంగా స్వీకరిస్తూ ప్రతిదినమూ సరస్వతీదేవిని అనేక స్తోత్రాలతో పూజించాడు.

ఇలా నలభై రోజులు కాగానే సరస్వతీమాత కరుణించింది. ఆ తల్లి పురుషోత్తమశాస్త్రికి కలలో కనపడి ఇలా చెప్పింది. నాయనా! పురుషోత్తమశాస్త్రీ! నీ కఠోరదీక్షకు మెచ్చాను. ఈ పాఠశాల తిరిగి దివ్యవైభవం వచ్చే మార్గం చెబుతాను. సావధానంగా వినవలసి ఉంది అని ఇలా చెప్పసాగింది. నాయనా! పురుషోత్తమశాస్త్రి నీవు జ్ఞానసరస్వతీ వ్రతం అనే వ్రతాన్ని ఆచరించు, ఇది నాకు ఎంతో ప్రీతికరమైనది. ఈ వ్రతం మహా మహిమాన్వితమైనది. ఈ వ్రతాన్ని వీలైనంత త్వరలో నీ పాఠశాల ప్రాంగణంలో ఆచరించు. ఈ వ్రత ప్రభావంచేత నీ పాఠశాలకు పేరుప్రఖ్యాతులు కలుగుతాయి. ఈ వ్రతంలోని ఐదు కథలూ చదివినవారికి సర్వజ్ఞానమూ లభిస్తుంది. ఈ వ్రతం ఆచరించేవారికి సర్వశుభాలూ కలుగుతాయి. ఏ పాఠశాలలోనైనా, ఏ విద్యాసంస్థలోనైనా, గురువులచేతనైనా, పాఠశాల యజమానుల చేతనైనా, ఆ ఊరివారిచేతనైనా ఈ వ్రతం ఆచరింపచేయవచ్చును. ఏ పాఠశాలలో ఈ వ్రతం సంవత్సరంలో ఒక్కసారైనా ఆచరింపబడుతుందో ఆ పాఠశాలలో విద్యార్థులు సంపూర్ణ జ్ఞానవంతులౌతారు. అన్ని విద్యలలో ఆరితేరుతారు. వారికి నా అపార అనుగ్రహం కలుగుతుంది. ఎంతో అద్భుతమైన జ్ఞాపకశక్తి కలుగుతుంది. ఏ విద్యార్థి అయినా ఈవ్రతంలోని ఐదు కథలనూ ఏ పరీక్షలకైనా ముందు చదివినచో వారికి ఆ పరీక్షలలో జయం కలుగుతుంది. పాఠశాలలయందు ఏ నెలలోనైనా పంచమి, ఏకాదశి తిథులందు ఆచరింపవచ్చును. ఆ రోజులలో విద్యార్థులకు ఈ ఐదు కథలూ వినిపించినచో వారు మంచి విద్యావంతులౌతారు. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులౌతారు. ఏ విద్యాసంస్థలలో ఈ వ్రతాన్ని 'శ్రీపంచమినాడు' ఆచరిస్తారో అక్కడ చదివే విద్యార్థులకు అన్ని పరీక్షలలోను జయం కలుగుతుంది. ఆ విద్యాసంస్థలకు ఎనలేని పేరుప్రఖ్యాతులు లభిస్తాయి. వచ్చేవారమే శ్రీపంచమి, నీవు ఆనాడు నీ పాఠశాలలో ఈవ్రతాన్ని ఆచరించంచు. శుభం



కలుగుతుంది' అని చెప్పి సరస్వతీమాత అంతర్ధానమైంది.

ఈ మాటలు విన్న పురుషోత్తమశాస్త్రి ఎంతో ఆనందించాడు. ఆ తల్లి తనను అనుగ్రహించినందుకు ఆ జగన్మాతని ఎన్నోవిధాల కొనియాడాడు. మరునాడు ఉదయం ఊరిపెద్దలకు రాత్రి తనకు కలిగిన స్వప్నం గురించి చెప్పాడు. వారందరూ ఎంతో సంతోషించారు. ఊరివారందరి సహాయంతో పురుషోత్తమశాస్త్రి శ్రీపంచమినాడు శ్రీ జ్ఞానసరస్వతీవ్రతం ఎంతో వైభవంగా ఆచరించాడు. ఈ వ్రతం ఆచరించిన ఫలితంగా అ పాఠశాల కొద్దికాలంలోనే ఎంతో అభివృద్ధి చెందింది. అనతికాలంలోనే చుట్టుప్రక్కల ఊళ్ళలో ఎంతో పేరున్న విద్యాసంస్థగా పేరుగాంచింది. అటు తరువాత కాలంలో ఆ పాఠశాల శ్రీజ్ఞానసరస్వతీపీఠంగా పేరొంది పెద్ద విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకొంది.

సరస్వతీమాత అంతటి కరుణామయురాలు. ఆ తల్లిని ఆరాధించిన వారికి విద్యా వినయాలు లభిస్తాయి. చదువుపై సంపూర్ణ ఏకాగ్రత ఏర్పడుతుంది. అద్భుతమైన గ్రాహణ శక్తి కలుగుతుంది. జ్ఞాపకశక్తి ఎంతో వృద్ధి చెందుతుంది. ఆ తల్లి శెలవిచ్చినట్లుగా అందరూ ఈ జ్ఞానసరస్వతీ వ్రతం నిత్యం ఆచరించి శుభప్రదంగా జీవించవచ్చును.

ద్వితీయ అధ్యాయము సమాప్తము

# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

## మూడవ అధ్యాయం

### గోపయ్య దివ్యకథ

పూర్వకాలంలో కృష్ణాతీరంలో పండితపురం అనే అగ్రహారం ఉండేది. అందులో అనేక బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. అగ్రహారంలో ఒక పెద్ద వేదపాఠశాల ఉండేది. చుట్టుపక్కల గ్రామాలనుంచి అనేకమంది విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకునేవారు. ఈ పాఠశాలలో చదివినవారు ఎన్నో శాస్త్రాలలో ఎంతో ప్రావీణ్యం సాధించి ఎంతో పేరు తెచ్చుకునేవారు. సాక్షాత్తూ ఆ సరస్వతీదేవి ఈ విద్యాపీఠంలో నడయాడుతుంటుందని ప్రజలు చెప్పుకునేవారు. ఈ పాఠశాలకు అంత గొప్పపేరు ఉండేది.

ఈ వేదపాఠశాలలో ఎందరో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉండేవారు. ఈ వేదపాఠశాలను రోజూ ఊడ్చి శుభ్రం చేయడానికి వీరయ్య అనే పనివాడు ఉండేవాడు. పాఠశాల పెద్ద విస్తీర్ణం గల స్థలంలో ఉండేది. దాదాపు ఐదు ఎకరాల ప్రాంగణం. ఆ పాఠశాల ఆవరణలో ఒకచోట చక్కటి హయగ్రీవుని శిల్పం ఉండేది. అలాగే ఆ పాఠశాల ప్రార్థనాభవనంలో ఒక చక్కటి సరస్వతీ దేవి విగ్రహం ఉండేది. ప్రతీరోజు ఉదయం విద్యార్థులందరూ ఈ భవనంలో ప్రార్థనచేసి సరస్వతీదేవికి నమస్కరించి అటు తరువాత బయటవున్న హయగ్రీవునికి నమస్కరించి తమ తమ తరగతులకు వెళ్ళేవారు.

వీరయ్య ప్రతిరోజు ఈ ప్రార్థనా భవనాన్ని శుభ్రం చేసేవాడు. వీరయ్యతోపాటు అతని కుమారుడు గోపయ్య పక్కనే తిరుగుతుండేవాడు. గోపయ్యకి కేవలం మూడు



సంవత్సరాలు. తండ్రితోపాటే ఆ పాఠశాల మొత్తం తిరుగుతుండేవాడు. చిన్నవాడైన గోపయ్యని ఎంతో తేజస్సు ఉట్టిపడుతున్న సరస్వతీదేవి విగ్రహం ఎంతో ఆకర్షించింది. ఆ తల్లి కనులలో ఆప్యాయత, అనురాగం, ఈ పిల్లవాడిని కట్టిపడేసేది. ప్రతిరోజు ఉదయం ఆ విగ్రహం ఎదురుగా ఆ తల్లిని చూస్తూ ఉండిపోయేవాడు.

గోపయ్య ఆడుతూ, పాడుతూ ఐదు సంవత్సరాల వయస్సుకు వచ్చాడు. తన వయస్సు పిల్లలు కొందరు ఆ పాఠశాలలో చదువుకొనటం చూశాడు. తనకూ అలా చదువుకోవాలని ఉండేది. కానీ తన తండ్రిద్వారా ఇది తనకు సాధ్యపడదని తెలుసుకున్నాడు. తండ్రితోపాటే ప్రతీ రోజూ ఆ పాఠశాల తిరుగుతూ ఎక్కడన్నా పాఠ్యపుస్తకాలు కనపడితే కనులకద్దుకుని పెట్టేవాడు. కొందరు విద్యార్థులు తమ పుస్తకాలు సరిగ్గా ఉంచుకొనక ఇటు, అటు పారవేసేవారు. గోపయ్య వీటిని తీసి కనులకద్దుకుని చక్కగా పేర్చి పెట్టేవాడు. ఇలా పెరిగి పెద్దవాడై పన్నెండు సంవత్సరాల వయస్సుకు వచ్చాడు. తండ్రికి పొలం పనులలో సాయం చేస్తుండేవాడు. ఉదయం పూట మాత్రం వేదపాఠశాల ఆవరణ మొత్తం తానే శుభ్రంగా ఊడ్చేవాడు. చివరన ప్రార్థనామందిరంలోని సరస్వతీమాత విగ్రహానికి మ్రొక్కేవాడు. వచ్చే జన్మలోనైనా తనకి ఈ పాఠశాలలో చదువుకునే భాగ్యం కలిగించమని ప్రార్థించేవాడు. రోజూ ఇతడిని గమనిస్తున్న సరస్వతీదేవికి గోపయ్యపై అనుగ్రహం కలిగింది. ఆ తల్లి ఇతడిని అనుగ్రహించాలని తలచింది.

ఒకరోజు ఆ ఊరికి కాంచీపురంనుంచి మహాపండితుడు వచ్చాడు. అంతగొప్ప పండితుడు వచ్చిన సందర్భంలో మరునాడు ఉదయం పెద్ద వేదసభ నిర్వహించబడింది. ఆ రోజు ఉదయాన్నే గోపయ్య తండ్రితో కలిసి పండిత సభ జరిగే ప్రదేశాన్ని చక్కగా శుభ్రం చేశాడు. కాసేపటికి ఆ సభంతా వేదపండితులతోను, వేదపాఠశాల ఉపాధ్యాయులతోను, విద్యార్థులతోనూ నిండిపోయింది. కాంచీపుర పండితుణ్ణి ఘనంగా సన్మానించారు. ఇదంతా గోపయ్య దూరంగా నుంచుని ఎంతో ఉత్సాహంగా చూస్తున్నాడు. పండితులందరూ రకరకాల శాస్త్ర విశేషాలపై మాట్లాడారు. చివరన కంచినుంచి వచ్చిన ఆ మహాపండితుడు అనేక శాస్త్ర విషయాలపై మాట్లాడి చివరన వ్యాకరణానికి సంబంధించిన ఒక సమస్యను చెప్పి అక్కడ ఉన్నవారిని సమాధానం చెప్పవలసిందిగా అడిగాడు. తాను ఎన్నో వేద సభలలో ఈ సమస్యను అడిగానని, ఎవ్వరూ సరైన సమాధానం చెప్పలేకపోయారని అన్నాడు. అందరూ ఈ సమస్యను విన్నారు. కానీ అక్కడ ఉన్న వేదపండితులు కానీ, ఉపాధ్యాయులుకానీ, విద్యార్థులు కానీ సమాధానం చెప్పలేకపోయారు.

ఆ క్షణంలోనే సరస్వతీమాతకు గోపయ్యను తాను అనుగ్రహించాలని తలచింది.

వెంటనే దూరంగా ఎక్కడో నుంచున్న గోపయ్య అందరికీ వినపడేలాగా గట్టిగా ఇలా అన్నాడు. ఆ సమస్యకు సమాధానం నేను చెప్తాను అన్నాడు. అక్కడ ఉన్నవారందరూ ఆశ్చర్యపోయారు. వారు ఏదో చెప్పబోయేటంతలో గోపయ్య ఆ వ్యాకరణసమస్యకు చక్కగా వివరంగా సమాధానం చెప్పాడు. అక్కడ ఉన్నవారి నోటమాట రాలేదు. అందరూ ఆశ్చర్యపడుతుండగా అక్కడ ఉన్న సరస్వతీ విగ్రహంనుంచి ఇలా వినపడింది. 'నాయనలారా! ఈ గోపయ్యకు చదువంటే ఎంతో శ్రద్ధ. ఏ స్తోత్రాలూ రానప్పటికీ నిత్యం నన్ను ఆరాధించాడు. నేను ఇతడికి ఈ క్షణంలోనే సర్వ విద్యలనూ అనుగ్రహించాను' అని వినపడింది. అక్కడితో అక్కడ ఉన్న వారందరూ తమ గర్వానికి సిగ్గుపడి సరస్వతీ కటాక్షం పొందిన గోపయ్యను ఘనంగా సన్మానించారు. తరువాత కాలంలో గోపయ్య మహా పండితునిగా పేరు తెచ్చుకుని ఎందరో గొప్ప శిష్యులను తీర్చి దిద్దారు.

సరస్వతీ మాత అంతటి కారుణ్యమూర్తి. ఆ తల్లిని నిత్యం స్మరించేవారికి సర్వ శాస్త్ర జ్ఞానమూ లభిస్తుంది. అన్ని పరీక్షలయందూ విజయం లభిస్తుంది. అన్ని కార్యాలయందూ శుభం కలుగుతుంది. ఆ తల్లికి ఇవే మన నమస్కారములు.

తృతీయ అధ్యాయము సమాప్తము



# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

## నాలగవ అధ్యాయం

### శంకరశాస్త్రి దివ్యకథ

పూర్వకాలంలో గంగానదీ తీరంలో మహేశ్వరపురం అనే పట్టణం ఉండేది. ఆ పట్టణంలో పెద్ద శివాలయం ఉండేది. ఆ ఊరిలో ఎంతో ప్రసిద్ధి గాంచిన సంగీత కళాశాల ఉండేది. ఈ కళాశాలలో సంగీతం అభ్యసించడానికి చుట్టుప్రక్కల గ్రామాలనుండే కాక ఎంతో దూర ప్రాంతాల నుండి కూడా విద్యార్థులు వచ్చేవారు. ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులు వివిధ సంగీత సాంప్రదాయాలలో ఎంతో నిష్ణాతులై ఉండేవారు. ప్రత్యేకించి ఎంతో వీణాప్రావీణ్యం గల విద్వాంసులు ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉండేవారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన శ్రీరామశర్మ హిందూస్థానీ సంగీతంలో ఎంతో పేరుపొందారు.

శ్రీరామశర్మకు శంకరశాస్త్రి అనే కుమారుడు ఉండేవాడు. కుమారుని ఎలాగైనా గొప్ప వీణా విద్వాంసునిగా తీర్చిదిద్దాలని శ్రీరామశర్మకు కోరికగా ఉండేది. ప్రాథమిక అభ్యాసం కాగానే శంకరశాస్త్రి తన పాఠశాలలోనే వీణ శిక్షణలో పెట్టాడు. వీణాప్రావీణ్యత పరీక్షకు ఐదు సంవత్సరాలు చదవాలి. శంకరశాస్త్రికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. కానీ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోయాడు. ఇది శ్రీరామశర్మకు ఎంతో బాధగా తోచింది.

శంకరశాస్త్రి తిరిగి సంవత్సరం తరువాత మళ్ళీ పరీక్షకు వెళ్ళాడు. అయినా ఉతీర్ణుడు కాలేదు. శ్రీరామశర్మకు కుమారుని గొప్ప వీణావిద్వాంసునిగా చూసే భాగ్యం లేదేమోనని బాధపడేవాడు. ఆ తరువాత సంవత్సరం కూడా శంకరశాస్త్రి పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేదు. శ్రీరామశర్మకు ఎంతో బాధ కలిగింది. దురదృష్టవశాత్తు పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. కుమారుని వీణావిద్వాంసునిగా చూడాలన్న కోరిక తీరకుండానే మరణిస్తాననే బెంగ పట్టుకుంది. శంకరశాస్త్రికి ఎంతో బాధ కలిగింది. ఈసారి పరీక్షలలో ఎలాగైనా ఉత్తీర్ణుడవ్వాలని తలచాడు. ప్రతీరోజు ఉదయం వీణను తీసుకునివెళ్ళి గంగానది ఒడ్డున కూర్చుని ఎంతో సాధన చేసేవాడు. సాధన చేస్తున్నంతసేపు ఆ సరస్వతీదేవినే

మనస్సులో స్మరించేవాడు. ఇలా నలభై రోజులు గడిచేసరికి ఇతడి సాధనను గమనిస్తున్న సరస్వతీదేవి అతడిని కరుణించి ఎదురుగా ప్రత్యక్షై ఇలా అన్నది. నాయనా! నీ కఠోర దీక్షకు మెచ్చాను. నీవు రేపే జ్ఞానసరస్వతీ వ్రతం ఆచరించు. ఈసారి పరీక్షలలో నీవు ప్రథమశ్రేణిలో ఉతీర్ణుడవటమే కాదు, భవిష్యత్‌లో గొప్ప విద్వాంసునిగా పేరు తెచ్చుకుంటావు అని ఆ వ్రతవిధానం వివరించి అంతర్ధానమైంది. శంకరశాస్త్రి ఆ తల్లి తనను అనుగ్రహించినందుకు ఎన్నో విధాల స్తుతించాడు. జరిగినవిషయంతా ఇంటికి వచ్చి తండ్రికి తెలిపాడు. శ్రీరామశర్మ ఆ సరస్వతీ మాత ఇన్నాళ్ళకు తన కుమారుని కరుణించినందుకు సంతోషించాడు.

ఆ మరునాడు ఉదయం శంకరశాస్త్రి శుచిగా స్నానం చేసి జ్ఞానసరస్వతీ వ్రతం ఆచరించాడు. వ్రతం పూర్తి అయిన తరువాత ఆ తల్లిని స్తుతిస్తూ ఒక గంటసేపు అద్భుతమైన వీణానాదం చేశాడు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. ఆ దివ్య వీణానాదం నుంచి వచ్చిన దివ్య తరంగాల ప్రభావంచేత శ్రీరామశర్మ పక్షవాతం ఒక్కసారిగా మాయమైంది. పూర్తి ఆరోగ్యంతో లేచి మంచంపై కూర్చున్నాడు. ఆ కుటుంబం అంతా తమను ఇన్ని విధలుగా కరుణించిన సరస్వతీమాతను ఎంతో స్తుతించారు. కుటుంబ సభ్యులందరూ జ్ఞాన సరస్వతీ వ్రత ప్రసాదాన్ని స్వీకరించారు.

అటు తరువాత కొన్ని రోజులకు జరిగిన పరీక్షలో శంకరశాస్త్రి ప్రథమ శ్రేణిలోఉత్తీర్ణుడయ్యాడు. తరువాత కాలంలో శంకరశాస్త్రి ఎంతో గొప్ప విద్వాంసునిగా పేరు పొందాడు. తండ్రి శ్రీరామశర్మ కల ఫలించింది. ఆ కుటుంబమంతా కలకాలం సరస్వతీమాతను సేవిస్తూ సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందారు.

సరస్వతీమాత అంతటి దయామయురాలు. ఎవరైనా తనను పూర్తి విశ్వాసంతో ఆరాధిస్తారో వారిని సంపూర్ణంగా అనుగ్రహిస్తుంది. ఆ తల్లి తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అనే భక్తునికి అనుగ్రహించిన ఈ జ్ఞాన సరస్వతీ వ్రతం ఎంతో మహాత్మ్యం కలది. ఇది ఆచరించినవారికి అన్ని కళలయందు ప్రావీణ్యత లభిస్తుంది. గొప్ప కళాకారులుగా, సంగీత విద్వాంసులుగా, మహాపండితులుగా, అద్భుత జ్ఞాన సంపన్నులుగా పేరొందుతారు. ఆ తల్లికి ఇవే మన నమస్కారములు.

చతుర్థ అధ్యాయము సమాప్తము



# శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం

## ఐదవ అధ్యాయం

భరద్వాజుని దివ్యకథ

పూర్వకాలంలో గోదావరీ తీరాన కౌండిన్యుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడెంతో నిష్ఠాగరిష్టుడై ఎప్పుడూ దైవచింతనలోనే కాలం గడిపేవాడు. వారసత్వంగా వచ్చిన పౌరోహిత్యపు వృత్తి నిర్వర్తిస్తూ వచ్చిన కొద్దిపాటి సొమ్ముతో సుఖంగా జీవించేవాడు. ఊరివారందరిచేత ఎంతో మంచివాడని పేరు తెచ్చుకున్నాడు. ఊరివారందరూ కలిసి అతడికి చిన్న ఇల్లు కట్టించి ఇచ్చారు. ఆ ఇంట్లో భార్య, కుమారునితో సుఖంగా జీవిస్తుండేవాడు.

అంతా బాగానే ఉన్నది కానీ కౌండిన్యుడికి ఒకటే బెంగ ఉన్నది. తన కుమారుడు భారద్వాజునకు సరిగా చదువు అబ్బటం లేదు. వారసత్వంగా వచ్చిన ఈ పౌరోహిత్యపు వృత్తితో అతడి జీవితం కూడా సుఖంగా గడుస్తుందని తలిస్తే అతనికి చదువు ఏమాత్రం రావడం లేదు. ఎప్పుడూ తృతీయ శ్రేణిలోనే ఉత్తీర్ణత పొందుతూ వేదపాఠశాలలో ఐదవ సంవత్సరానికి వచ్చాడు. ఇంకా ఏడు సంవత్సరాలు చదవాలి. అప్పుడే అతడికి పూర్తి ప్రావీణ్యత వస్తుంది. కానీ ప్రతీ సంవత్సరం పరీక్షలలో చాలా తక్కువ స్థాయిలో ఉండేవాడు. కౌండిన్యుడికి బెంగగా ఉండేది.

ఇంకొక వారం రోజులలో ఐదవ సంవత్సరం పరీక్షలు. ఈ పరీక్ష ఇంతకు ముందువాటికంటే ఎంతో కఠినమైనది. భరద్వాజుడు ఇందులో అసలు ఉత్తీర్ణుడౌతాడా అనే బెంగ తండ్రికి పెట్టుకున్నది. ఇలా ఆలోచిస్తుండగా పక్క ఊరి జమీందారు నౌకరు వచ్చాడు. అయ్యా మిమ్ముల్ని మా జమీందారుగారు ఎల్లుండి ఉదయాన్నే ఆరు గంటలకల్లా రమ్మన్నారు. వారింటిలో సరస్వతీ వ్రతం చేయవలసింది ఉన్నదట అని చెప్పి వెళ్లిపోయాడు. సరస్వతీ వ్రతమా? ఇది ఎప్పుడూ నేను విని ఉండలేదే. ఏదేమైనా ఆ వ్రతమేదో తాను కూడా తెలుసుకుందామని అనుకున్నాడు.

ఆ తరువాత రెండోరోజు ఉదయమే చీకటితో లేచి, స్నానం చేసి శుభ్రమైన దుస్తులు ధరించి పక్కఊరు జమీందారు గారింటికి ఆరుగంటలకు ఇల్లు చేరుకున్నాడు. జమీందారు కౌండిన్యుడితో ఇలా అన్నాడు. స్వామీ! ఈ జ్ఞానసరస్వతీ వ్రతం గురించి కిందటివారమే తెలిసింది. కిందటి శనివారం నేనిక్కడి పదిమైళ్ళ దూరంలో గల రామాపురం ఏదో పనిమీద వెళ్ళినప్పుడు అక్కడ ఒకరింట ఈ వ్రతం ఆచరిస్తుండగా

చూశాను. ఈ వ్రతం ఆచరిస్తే పిల్లలకు చక్కటి చదువు, జ్ఞానమూ, మంచి నడవడి వస్తాయట. ఆ వ్రతవిధానం అంతా తెలుసుకున్నాను. తమరు దయచేసి ఆ వ్రతం నాచేత ఆచరింపచేయవలసింది. మా పిల్లలు సరియైన మార్గంలో లేరు. ఏ మాత్రం వినయవిధేయతలు లేవు. ఈ జ్ఞానసరస్వతీ వ్రతం చేస్తేనైనా వారికి మంచి నడవడిక వస్తుందని నా ఆశ అని అన్నాడు.

కౌండిన్యుడు ఆ దంపతులచేత ఆ జ్ఞానసరస్వతీ వ్రతం ఆచరింపచేశాడు. ఆ వ్రత కథలు అద్భుతంగా ఉన్నాయి. ఆ కథలు చదువుతున్నంతసేపు ఆ సరస్వతీమాతే కౌండిన్యుడి కళ్ళముందు నిలబడింది. వ్రతం అయిన తరువాత వ్రతప్రసాదం తానూ కొంచెం పొట్లం కట్టుకుని జమీందారు వద్ద శెలవు తీసుకుని ఇంటికి వచ్చాడు. శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రత ప్రసాదాన్ని తాను, తన భార్య స్వీకరించి, తన కుమారునికి కూడా ఇచ్చాడు. భరద్వాజుడు కన్నులకద్దుకుని ఆ ప్రసాదాన్ని తీసుకున్నాడు.

అద్భుతమైన శ్రీ జ్ఞానసరస్వతీ వ్రతం ప్రసాదాన్ని స్వీకరించటంచేత భరద్వాజునికి ఆ తల్లి అనుగ్రహం కలిగి అయిదవ సంవత్సరం పరీక్షలు చక్కగా వ్రాశాడు. పరీక్షలు కాగానే కౌండిన్యుడు తన ఇంట్లో భార్యా, కుమారులను పక్కనే కూర్చోబెట్టుకుని శ్రీ జ్ఞానసరస్వతీ వ్రతం ఆచరించాడు. ఈ వ్రత ఫలితంగా భారద్వాజుడు ఈసారి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ సరస్వతీమాత తమను ఇన్నాళ్ళకు కరుణిచించినందుకు కౌండిన్యుడు ఎంతో సంతోషపడ్డాడు. అప్పటినుంచీ ప్రతీ సంవత్సరం వారు శ్రీ జ్ఞానసరస్వతీ వ్రతం ఆచరించసాగారు. భారద్వాజుడు పన్నెండు సంవత్సరాలు వేదవిద్యను ప్రతీ సంవత్సరం ప్రథమశ్రేణిలో ఉత్థీర్ణుడయ్యాడు. గొప్ప పండితునిగా పేరు పొందాడు. అప్పటినుంచీ ప్రతీ సంవత్సరం ఆ కుటుంబం శ్రీ జ్ఞానసరస్వతీ వ్రతం ఆచరిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

శ్రీ జ్ఞానసరస్వతీ వ్రతం మహామహిమాన్వితమైనది. ఈ వ్రతం ఆచరింపటం ఎంతో సులభం. ప్రతీ సంవత్సరం ఈ వ్రతం ఆచరించే విద్యాసంస్థలలో చదివే విద్యార్థులు ఎంతో అభివృద్ధిలోకి వస్తారు. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులౌతారు. అంతేకాదు, వారికి మంచి నడవడిక కలుగుతుంది. గొప్ప సంస్కారం అబ్బుతుంది. జీవితాంతం సత్ప్రవర్తనతో జీవిస్తారు. ఉన్నతశ్రేణి ఉద్యోగాలు లభిస్తాయి. శ్రీ సరస్వతీమాత తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అనే భక్తునికి అనుగ్రహించిన ఈ వ్రతం కలియుగంలో విద్యలో రాణించటానికి అతి సులభమార్గం. ఇంతటి తేలికైన వ్రతాన్ని మనకు అనుగ్రహించినందుకు ఆ తల్లికి మనందరమూ నమస్కరిద్దాము.

పంచమ అధ్యాయము సమాప్తము



# శ్రీ జ్ఞాన సరస్వతి ప్రార్థన

శుద్ధాం బ్రహ్మ విచార సార ప రమాం ఆద్యాం జగద్వ్యాపినీం ।
వీణా పుస్తక ధారిణీం అభయ దాం జాడ్యా న్ధకారా పహా ।
హస్తే స్ఫాటిక మాలికాం విదధతీం పద్మాసనే సంస్థితాం ।
వన్దేతాం పరమేశ్వరీం భగవతీం బుద్ధిః ప్రదాం శారదామ్ ।

యా కుందేందు తుషారహార ధవళా యాశుభ్ర వస్త్రాన్వితా ।
యా వీణా వరదండ మండితకరా యాశ్వేత పద్మాసనా ।
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతి భిర్దేవై సదా వందితా ।
సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా ॥

యా మాయా మధుకైటభ ప్రమథని యా మాహిశోన్మాలిని ।
యాదూమ్రేక్షణ దండ ముండ మథని యా రక్త బీజాసిని ।
శక్తీ శుంభ నిశుంభ దైత్య దలిని యా సిద్ధ లక్ష్మీఃపరా ।
సా చండీ నవకోటి మూర్తి సహితా మాం పాతు విశ్వేశ్వరి ॥

సిద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ । జయలక్ష్మీ సరస్వతి ।
శ్రీ లక్ష్మీ వరలక్ష్మీశ్చ । ప్రసన్న మమ సర్వదా ॥

సర్వ మంగల మాంగల్యే । శివే సర్వార్థ సాధికే ।
శరణ్యే త్రయంబకే దేవి । నారాయణి నమోస్తుతే ॥

శరదిందు సమాకారే । పరబ్రహ్మ స్వరూపిణి ।
వాసరా పీఠ నిలయే । సరస్వతి నమోస్తుతే ॥



ఓం వాగ్దేవ్యైచ విద్మహే
బ్రహ్మ పత్న్యైచ ధీమహిః
తన్నో వాణీ ప్రచోదయాత్



తల్లీ! నిన్నుదలంచి పుస్తకము చేతంబూనితిన్ నీవు నా
యుల్లం బందున నిల్చి జృంభణముగా సుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదువాక్కునన్ సంప్రీతిన్ జగన్మోహినీ!
పుల్లాబ్జాక్షి! సరస్వతీ! భగవతీ! పూర్ణేందు బింబాననా!